

పంద్రాగస్టు ఏర్పాట్లు పూర్తి

జెండా పండుగకు పరేడ్ గ్రౌండ్ ముస్తాబు

జెండా ఆవిష్కరణకు మంత్రి నారా లోకేశ్



పోలీసు పరేడ్‌గ్రౌండ్స్‌లో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ



అతిథిల కోసం వేసిన టెంట్లు



గుంటూరులో జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

గుంటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలకు గుంటూరులోని పోలీసు పరేడ్ గ్రౌండ్ సిద్ధమైంది. జాతీయ జెండాల రెపరెపలతో ప్రాంగణం ముస్తాబైంది. విద్యుత్ వెలుగుల్లో కలెక్టరేట్‌తో పాటు ఇతర కార్యాలయాలు, కలెక్టర్, జేసీ బంగ్లాలు నూతన శోభను సంతరించుకున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత జరుగుతున్న తొలి జెండా పండుగ కావడంతో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇంతకుముందెన్నడూ జరగని రీతిలో గురువారం వేడుకలను నిర్వహించేందుకు పోలీసు పరేడ్‌గ్రౌండ్స్‌లో అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. ప్రొటోకాల్ మంత్రిగా నారా లోకేశ్‌ని రాష్ట్ర ప్రభుత్వం నియమించడంతో ఆయన త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా ఆయన త్రివిధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించడంతో పాటు స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని ఇస్తారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని వీక్షిస్తారు. వివిధ శాఖల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, ఉద్యోగులను మంత్రి లోకేశ్ ప్రశంస పత్రాలతో సన్మానిస్తారు. ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవతేజ పరిశీలించారు.

లోకేశ్‌కు భారీగా స్వాగత ఏర్పాట్లు

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నారా లోకేశ్ తొలిసారిగా గుంటూరు పర్యటనకు వస్తుండటంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేశారు. లోకేశ్ కాన్వాయ్ వచ్చే మార్గాన్ని ఫ్లెక్సీలతో నింపేశారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, పార్టీ సీనియర్ నేత మన్నవ మోహనకృష్ణ తదితరులు బాధ్యత తీసుకుని ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ వెలుగుల్లో మంగళగిరిలోని ఎయిమ్స్

పరేడ్ గ్రౌండ్‌లో రిహార్సల్స్

గుంటూరు: పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం జరగనున్న వేడుకలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. బుధవారం నిర్వహించిన సన్మాన్ గాడ్ ప్రాక్టీస్ పరేడ్‌ను ఎస్పీ పరిశీలించారు. ఏర్పాట్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. బందోబస్తులో ఉన్న పోలీస్ సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ఈ వేడుకలను సజావుగా జరిగేలా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్య క్రమంలో ఏఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వరావు, నచ్చికేట్‌సెల్కే, హనుమంతు, డీఎస్పీలు శాంతకుమార్, మహేష్, భాషా, సుబ్బారావు, నగరంపాలెం సీఐ మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

గుంటూరు(విద్య): ఏబీవీపీ ఆధ్వర్యంలో గుంటూరులో బుధవారం భారీ జాతీయ జెండా ప్రదర్శన జరిగింది. నగరంలోని ప్రధాన రహదారులవెంట సాగిన జెండా ప్రదర్శన ప్రజల్ని ఆకట్టుకుంది. ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని పెంచేలా కార్యక్రమం సాగింది.

విద్యుత్ కాంతుల్లో సచివాలయం

తుళ్లూరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజధాని అమరావతి పరిధి లోని వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ భవనాలను విద్యుత్ దీపాల తో అలంకరించారు. జాతీయ జెండా రంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో బుధవారం రాత్రి సచివాలయం, అసెంబ్లీ భవనాలు కాం తులీనాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆయా భవనాలను పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సచివాలయం ముస్తాబు చేశారు. తిరిగి చంద్ర బాబు సీఎం కావడంతో సచివాలయ భవనాలు నూతన శోభను సంతరించుకున్నా యని రాజధాని వాసులు హర్షం వ్యక్తం చేశారు.



ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేం దుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హర్ ఘర్ తిరంగా 3.0 కార్యక్ర మంలో భాగంగా కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి పంపిన లేఖను, జాతీయ జెండాను మంగళగిరి సబ్ డివిజన్ పోస్టాఫీస్ అసిస్టెంట్ సూపరిం టెండెంట్ ఆర్ రాధాకృష్ణమూర్తి బుధవారం మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. గుంటూరులో జరిగే స్వా తంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన నున్న లోకేశ్‌కు మంగళగిరి తహసీల్దారు ఆహ్వాన పత్రిక ను అందజేశారు. - తాడేపల్లి టౌన్

ఆక్టోపస్ ఏఎస్పీకి ఇండియన్ పోలీస్ మెడల్



తాడేపల్లి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్క రించుకుని కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్ కు ఆక్టోపస్ ఏఎస్పీ కే రామచంద్ర మూర్తిని ఎంపిక చేసింది. 2020 నుంచి వడ్డేశ్వ రంలోని ఆక్టోపస్‌లో కార్యాలయంలో ఆయన విధులు నిర్వహిస్తున్నారు. 1991లో ఆర్ఎస్ఐగా విధుల్లో చేరి 2009లో అసిస్టెంట్ కమాండెంట్‌గా 2020లో అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతులు పొందారు. గతంలో డిచ్‌పల్లి 7వ పటాలం, కొండాపూర్ 8వ పటా లం కాకినాడ 3వ పటాలం, మంగళగిరి 6వ పటాలంలో వివిధ హోదాల్లో ఆయన సేవలు అందించారు. 2004 నుంచి 2007 వరకు గ్రే హౌండ్స్, 2017 నుంచి 2020 వరకు స్టేట్ ఆర్మ్ ఇన్‌స్పెక్షన్ అథారిటీలో అత్యుత్తమ సేవలు అందించారు. 2012లో రామచంద్రమూర్తి సేవల కు గుర్తింపుగా ఏపీ పోలీస్ సేవా సంఘం సర్వీసులో 8 క్యాష్ రివార్డులు, 38 గుడ్ సర్వీస్ ఎంట్రీ, 25 అప్రి యేష న్స్, 28 కమెండేషన్స్, గోదావరి కృష్ణా పుష్క రాలలో 3 ప్ర శం సాపత్రాలు పొందారు. రామచంద్ర మూర్తికి ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ లభించడంపై పోలీసు, ఆక్టోపస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



విద్యుత్ కాంతుల్లో గుంటూరు రైల్వే స్టేషన్



విద్యుత్ కాంతుల్లో గుంటూరు కలెక్టరేట్

జీఎంసీ కమిషనర్‌గా.. పులి శ్రీనివాసులు

- కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరణ
- నగరాభివృద్ధికి సమష్టిగా ముందుకు సాగుతామన్న అధికారి



గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 14: గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్‌గా ఇటీవల నియమితులైన పులి శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలసి నగరాభివృద్ధి కోసం సమిష్టిగా పని చేస్తామన్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. గతంలో ఇక్కడ పని చేసినందున నగరంపై సమగ్ర అవగాహన ఉందన్నారు. మొండిబకాయిదార్ల నుంచి పన్నుల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తామని తెలిపారు. నగరాభివృద్ధికి ఆదాయ వనరుల పెంపు, ఉన్న వనరులను సద్వినియోగం చేయడానికి ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజలకు మెరుగైన పుర సేవలు అందించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రిని కలిసిన కమిషనర్

నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం పులి శ్రీనివాసులు సచివాలయంలో పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ, పురపాలక స్పెషల్ చీఫ్ సెక్రెటరి అనిల్‌కుమార్ సింఘాల్‌ను కలిశారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకముందు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులుకు నగరపాలక సంస్థ ఏసీ రాజ్యలక్ష్మి, డీసీలు టీ వెంకటకృష్ణయ్య, సీహెచ్ శ్రీనివాస్, డీ వెంకటలక్ష్మి, ఎస్ఈ ఎం శ్యాంసుందర్, సీపీ ప్రదీప్‌కుమార్, ఎంహెచ్‌వో మధుసూదన్, విభాగాధిపతులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు, శాలువాలు అందించి అభినందనలు తెలిపారు.


కుడి కాల్వకు నీటి సరఫరా కొనసాగింపు

1 నుంచి జోన్ - 2 ఆయకట్టుకు సాగు నీరు

నరసరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడికాల్వ ఆయకట్టుకు నీటి సరఫరాపై జలవనరుల శాఖ స్పష్టత ఇచ్చింది. జోన్-1 ఆయకట్టుకు నీటి సరఫరాను కొనసాగిస్తున్నారు. ఈ ఆయకట్టు పరిధిలో రైతులు వరి సాగు చేసుకోవచ్చని వెల్లడించింది. పమిడిపాడు బ్రాంచి కెనాల్ మినహా జోన్-1లోని పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలోని ఆయకట్టు అం తటకి సాగు నీటి సరఫరా కొనసాగుతోంది. ఒకటో తేదీ నుంచి జోన్-2 ఆయకట్టులోని ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో సాగు నీటిని సరఫరా చేయనున్నారు. ఈ మేరకు జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీరు రవి బుధవారం తెలిపారు. వరి, పత్తి, మిరప తదితర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. నీటిని వృథా చేయకుండా పొదు పుగా పంటలకు విని యో గించుకోవాలని తెలిపారు.

సాగర్‌లో పూర్తి స్థాయికి నీరు

నాగార్జున సాగర్ జలాశయం నుంచి కుడి కాల్వకు 7,528 క్యూ సెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ డ్యాంలో నీటి మట్టం పూర్తి స్థాయికి అంటే 590 అడుగులకు చేరింది. 312.05 టీఎంసీలకు జలాశయంలో 312 టీఎంసీల నీటి నిల్వ ఉంది. దీంతో డ్యాం క్రస్ట్ గేట్ల మళ్లీ తెరుచుకున్నాయి. బుధవారం డ్యాం రెండు గేట్లను తెరచి దిగువకు 16,200 క్యూసె క్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం ఇన్‌ఫ్లో 63,123 క్యూసెక్కులు కాగా ఆదే స్థాయిలో నీటి విడుదల జరుగుతోంది. బుగ్గవాగు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 2.83 టీఎంసీలకు 0.63 టీఎంసీల నీటి నిల్వ ఉంది. బుగ్గవాగు నుంచి కుడి కాల్వకు 5,095 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాల్వ పరిధిలో ము మ్మరంగా వరి నారు మళ్ల సాగు పనులు జరు గుతున్నాయి. మరో వైపు పత్తి, మిరప పంటలను రైతులు సాగు చేస్తున్నారు.



బుగ్గవాగు నుంచి నీటి సరఫరా

నేటి నుంచి అన్న క్యాంటీన్లు

గుంటూరులో 7 క్యాంటీన్లు ప్రారంభం

సౌకర్యాలను పరిశీలించిన మంత్రి నారాయణ

గుంటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రారంభించనున్నారు. గుంటూరులో ఏడు క్యాంటీన్లు గురువారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లో సిద్ధమైన అన్న క్యాంటీన్‌లోని ఏర్పాట్లు, సౌకర్యాలను బుధవారం మంత్రి నారాయణ పరిశీలించారు. భవన నిర్మాణం, వడ్డించే ప్రాంతం, వాష్ ఏరియాల వద్ద ఏర్పాట్లపై పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసరావు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో 183 అన్న క్యాంటీన్లు ప్రారంభించగా వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసి పేదల పొట్టకొట్టిందన్నారు. గుంటూరు జోన్ పరిధిలో 39 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తుండగా ఒక్క గుంటూరులోనే 8 క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వైసీపీ తీరుతో ఆ పార్టీ నాయకులే విసిగిపోయి తమ పార్టీ వైపు వస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే పలు మున్సిపల్ కార్పొరేషన్లను కూటమి కైవసం చేసుకుంటుందన్నారు. గత సీఎం ఎప్పుడూ ప్రజల్లోకి రాలేదని, ఇంట్లోనే ఉండి పాలన సాగించారన్నారు. ప్రజల్లోనే ఉండాలనేది తమ సీఎం చంద్రబాబు విధానమని చెప్పారు. అందుకే ఉండవల్లిలో తన నివాసం ఎదురుగానే అన్న క్యాంటీన్ ఉన్నప్పటికీ అక్కడ కాకుండా గుడివాడలో ప్రజల మధ్యలో ఉన్న క్యాంటీన్ ప్రారంభించాలని చంద్రబాబు నిర్ణయించారని మంత్రి నారాయణ తెలిపారు.



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే మాధవి

గంజాయి విక్రేతల అరెస్టు

● 1.3 కేజీలు స్వాధీనం ● సీఐ రమేష్‌బాబు వెల్లడి


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 14: పట్టణంలో గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తును అరెస్టు చేసినట్లు త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు తెలిపారు. బుధవారం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రమేష్‌బాబు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వాధీనం చేసుకున్న గంజాయిని, నిందితుల వివరాలను వెల్లడించారు. పట్టణంలోని సుల్తానాబాద్ కుమార్ పంపుల కాలనీ రైల్వే కరెంటు సబ్ స్టేషన్‌కి వెళ్లే రోడ్డులోని ఖాళీ స్థలం సమీపంలోని చెట్ల వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంమేరకు ఏఎస్‌ఐ బీ.రమేష్‌బాబు తన సిబ్బందితో దాడి చేశారు. ముక్కామల సంజయ్, కటికల సాయికుమార్, చిక్కాల గిడియాస్, మల్లెల వెంకట సుబ్రహ్మణ్యం, షేక్ అబ్దుల్ రెహమాన్‌లను అదుపులోకి తీసుకోగా, ఇద్దరు పరారయ్యారు. విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఈ ముఠా 1.5 కేజీల గంజాయిని రూ.18 వేలకు కొనుగోలు చేసి, తెనాలికి తీసుకు వచ్చి చిన్నచిన్న ప్యాకెట్‌లుగా విక్రయిస్తున్నారు. వీరివద్ద నుంచి 1.3 కేజీ గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు. నిందుతులను చాకచక్యంతో పట్టుకున్న ఏఎస్‌ఐ రమేష్‌బాబు, పీసీలు పీ.మురళి, డీ.సురేష్, జీ.సురేంద్రలను త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు అభినందించారు.

బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి అర్బన్, ఆగస్టు 14 : బీసీల బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఏపీలో అనంతరామన్ కమిషన్ సిఫారసు మేరకు తొలిసారిగా 25 శాతం రిజర్వేషన్లు ఇచ్చారని, అరంతకం మురళీధర్ కమిషన్ సిఫారసు మేరకు 44 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ఎన్టీఆర్ జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసిందన్నారు. ప్రభుత్వ శాఖలు, యూనివర్శిటీలు, ఎయిడెడ్ సంస్థలు, కార్పొరేషన్లలో రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. బీసీ సంక్షేమ సంఘం నేతలు జరిపిన సర్వేలో లక్ష వరకు బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులు ఉన్నాయని వీటన్నింటిని భర్తీ చేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు కృషి చేయాలన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 14 : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 42.16 టీఎంసీల నీటి నిల్వవున్నట్టు ప్రాజెక్టు అధికారి ఏఈ రాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎగువ నుంచి 23,646 క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతుండగా, దిగువకు 23,646 క్యూసెక్కులు విడుదలచేస్తున్నామని, వీటిలో 12,400 క్యూసెక్కులు పవర్ జనరేషన్ ద్వారా విడుదల అవుతుందన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

● అధికారులకు మంత్రి నారా లోకేశ్ సూచనలు
● 26వ రోజు ప్రజాదర్బార్‌కు విజ్ఞప్తుల వెల్లువ

తాడేపల్లిటౌన్, ఆగస్టు 14: మంత్రి లోకేశ్ పలకరింపులోనే తమ సమస్యలు సగం పరిష్కారం అయినంత భరోసా అనిపిస్తుందని ప్రజాదర్బార్‌కు వచ్చిన అర్జీదారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్న ఉండవల్లిలోని ప్రజాదర్బార్‌కు 26వ రోజు బుధవారం విజ్ఞప్తులు వెల్లువెత్తాయి. వచ్చే విన్నపాలను సంబంధిత శాఖలకు పంపి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు.

వైసీపీ ప్రభుత్వ అండతో తన 25 ఎకరాల భూమిని కబ్జా చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన సారిపాక నరసమాంబ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. తిరుమలలో నిర్వాసితులైన వారికి చిరు వ్యాపారాలు చేసుకునేందుకు హాకర్ లైసెన్సులు, షాపులు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సుద్దల రాజుయాదవ్ మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.

గత వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి కారణంగా డిప్లమో సర్టిఫికెట్లు నూజివీడు పాలిటెక్నిక్ కాలేజిలోనే ఉండిపోయాయని, ఉన్నత చదువుల కోసం సర్టిఫికెట్టు అందించేలా చర్యలు తీసుకోవాలని మంగళగిరి నియోజకవర్గం ఆత్మకూరుకు చెందిన చిల్లపల్లి జగదీష్ విజ్ఞప్తి చేశారు. కాజ గ్రామంలోని తన 20 సెంట్ల వ్యవసాయ భూమిని అడంగల్, 1బీలో నమోదు చేయాలని మోదుగుల శేషుబాబు కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న తనకు వికలాంగ పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన వీ.విజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

కృష్ణాజిల్లా గుడివాడలోని డాక్టర్ గురురాజు ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజీలో పీజీ అడ్మిన్లు కల్పనకు చర్యలు తీసుకోవాలని కళాశాలకు చెందిన గ్రాడ్యుయేట్ విద్యార్థులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.


బాధితుల సమస్యలను ఆలకిస్తున్న మంత్రి నారా లోకేశ్


దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్

వైసీపీ ప్రభుత్వ హయాంలో రేపల్లెలో నకిలీ డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి తమ పేర్లతో అక్రమ రుణాలు పొందిన ఆర్పీ షేక్ ముంతాజ్, అందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10 లక్షల మంది టూవీలర్స్ మెకానిక్‌ల సమస్యలు పరిష్కరించాలని ఏపి టూవీలర్స్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి కోరారు. కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులు మంజూరుతో పాటు టూవీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించిన తనకు జన్మదిన తేదీ తప్పుగా నమోదుచేసిన కారణంగా వెటర్నరీ కౌన్సిలింగ్‌లో అర్హత సాధించలేకపోయాయని, తన సమస్యను పరిష్కరించాలని రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లికి చెందిన జీ.జయనాగ మల్లీశ్వరి మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తనకు వైద్యసాయం అందించాలని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన గంజి రామకృష్ణ కోరారు.

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని ప్రకాశం జిల్లా సీఎస్ పురంకు చెందిన దేవండ్ల తిరుపతయ్య మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

ఎలాంటి ఆధారం లేని తనకు రేషన్ కార్డుతో పాటు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని తిరుపతికి చెందిన 74 ఏళ్ల జి వైదర్బి అనే వృద్ధురాలు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కర్నూలు జిల్లా ఉరుకుంద శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో పని చేస్తున్న తనను వైసీపీ ప్రభుత్వం ఉద్యోగం నుంచి తొలగించిందని తిరిగి పునరుద్ధరించాలని ఉరుకుందకు చెందిన ఆర్ నర్సింహులు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థలో (సీఆర్‌డిఏ) పని చేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆఫీస్ సబార్డినేట్, ఫెసిలిటేటర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బంది మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

స్వాతంత్ర్య దేశంలో మహిళలకు రక్షణ కరవు

● మంగళగిరి ఎయిమ్స్ వైద్య కళాశాల విద్యార్థులు
● వైద్య విద్యార్థినిపై అత్యాచార ఘటనను ఖండిస్తూ నిరసన
● వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్

మంగళగిరి, ఆగస్టు 14: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పుకుంటున్న మన దేశంలో ఈనాటికి మహిళలకు రక్షణ కరవైందని మంగళగిరి ఎయిమ్స్ వైద్య కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కలకత్తా ఆర్జికర్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ స్థానిక ఎయిమ్స్ వైద్య కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎయిమ్స్ వైద్య కళాశాల నుంచి విద్యార్థులు 'వుయ్ వాంట్ జస్టిస్' ప్లకార్డులు చేతబూని మెయిన్‌గేటు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ విధులు నిర్వహిస్తూ విశ్రాంతి కోసం వెళ్లిన వైద్య విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడడం, అది కూడ కళాశాల ఆవరణలోనే ఈ ఘాతుకానికి పాల్పడడం స్వతంత్ర్య దేశానికే అవమానమని అన్నారు. కలకత్తా అర్జికర్ కళాశాలలో జరిగిన ఈ దారుణానికి బెంగాల్ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. వైద్యుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక



మంగళగిరి ఎయిమ్స్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యవిద్యార్థులు

చర్యలు చేపట్టాలని కోరారు. తమ ఈ డిమాండ్లను నెరవేర్చేవరకు తమ ఈ నిరసనను కొనసాగిస్తూనే ఉంటామని హెచ్చరించారు.

వైద్యులపై దాడులు అరికట్టేందుకు కఠిన చట్టాలు తేవాలి

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్ డిమాండ్



సంతాప సభలో పాల్గొన్న ఐఎంఏ వైద్యులు

గుంటూరు(మెడికల్): వైద్యులపై దాడులు అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినచట్టాలు చేసి అమలు పర్చాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్‌కోరారు. మంగళవారం రాత్రి కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని జీఎంఏ హాల్లో నిర్వహించిన ట్రైనీ పీజీ డాక్టర్ మౌమిత దేబాంత్ సంతాప సభ, క్యాండిల్ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. సభకు ఐఎంఏ నగర అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. దేశవ్యాప్తంగా వైద్యులపై దాడులు పెరిగిపోతున్నాయని డాక్టర్ నందకిషోర్ ఆందోళన వ్యక్తంచేశారు. వీటిని అరికట్టేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు అమలు పర్చాలని ఆయన డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ నగర కార్యదర్శి బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి, ఉపాధ్యక్షుడు వెలగా మహేష్, బాలినేని సాయికృష్ణ, కే.రామలింగేశ్వర రావు, వీఆర్ తారక్‌నాథ్, సీహెచ్ విశ్వేశ్వరరావు, బీటీ.అప్పారావు, టీ.సేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, ఆగస్టు 14: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు బుధవారం ప్రాజెక్ట్ రెండు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. రెండు గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 16200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7528 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7601 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,394 క్యూసెక్కులు, రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 16200, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 63,123 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 63,123 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. కాగా ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లకు జాతీయ జెండా రంగులతో లైట్లను అమర్చారు.

స్నాక్స్ పంపిణీ విధులు వివాదాస్పదం

గుంటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం గుంటూరు జిల్లాలో పలువురు గ్రామ సచివాలయాల ఉద్యోగులకు కేటాయించిన విధులు వివాదాస్పదమయ్యాయి. సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి డీ.మధుసూదనరావు 50 మంది ఉద్యోగులకు వేడుకలు జరిగే పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో స్నాక్స్ పంపిణీ బాధ్యతలు కేటాయిస్తూ ప్రొసీడింగ్స్ జారీచేశారు. ప్రత్తిపాడు, తాడికొండ, పొన్నూరు నియోజకవర్గాల్లోని పలు మండలాలకు చెందిన వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లకు ఈ విధులు వేశారు. బుధవారం ఉదయం ఆయా ఉద్యోగులకు ఈసమాచారాన్ని తెలిపారు. దీనిపై వారు తీవ్ర అసంతృప్తికి గురై అసోసియేషన్ నాయకుల ద్వారా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై మంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో సాంఘిక సంక్షేమ అధికారి మధుసూదనరావు తాను జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ని ఉపసంహరించుకొన్నారు.


నరసింహారావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్

మాచర్లటౌన్, ఆగస్టు 14: పట్టణంలోని 22వ వార్డు వైసీపీ కౌన్సిలర్ బత్తుల నరసింహారావు టీడీపీలో చేరారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి నివాసంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పార్టీ కండువా కప్పి నరసింహారావును సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యర్రాకుల సిద్దయ్య, షేక్ సుభాని, గట్ల కోటిరెడ్డి, ఎం.శ్రీనివాసరావు, ముస్తఫా, చంద్రం పాల్గొన్నారు.

జడ్పీ సీఈవో బదిలీ ?

● మాతృ శాఖకు వెళ్లనున్న వసంతరాయుడు

గుంటూరు సిటీ, ఆగస్టు 14 : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సీఈవో వసంతరాయుడు బదిలీకి రంగం సిద్ధమైంది. రేపో మాపో బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్నికలకు ముందు జరిగిన బదిలీలలో అమలాపురం ఆర్డీవోగా ఉన్న వసంతరాయుడుని గుంటూరు సీఈవోగా ప్రభుత్వం నియమించింది. ఎన్నికలు ముగియటంతో మళ్ళీ మాతృశాఖకు వెళ్లేందుకు సీఈవో ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కూడా రెవెన్యూ శాఖ నుండి వచ్చిన వారిని తిరిగి అదే శాఖకు పంపేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వసంతరాయుడు బదిలీ ఖరారు అయినట్లు ప్రచారం జరుగుతోంది.

విజ్ఞాన్‌తో కేంబ్రిడ్జి యూనివర్సిటీ ఎంవోయూ


ఒప్పంద పత్రాలు స్వీకరిస్తున్న డాక్టర్ లావురత్తయ్య తదితరులు

గుంటూరు (విద్య),ఆగస్టు14: ఇంగ్లాండ్‌లోని ప్రతిష్టాత్మక కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయలోని ఇంగ్లీషు అసెస్‌మెంట్ విభాగం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంతో లింగ్విస్టిక్ సర్టిఫికేషన్ ఇన్ ఇంగ్లీషు లాంగ్వేజ్ కార్యక్రమంపై అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు వీసీ ఆచార్య పీ.నాగభూషణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంబ్రిడ్జి వర్సిటీ సౌత్ ఏసియా రీజనల్ డైరెక్టర్ అరుణాచలం, సౌత్ ఇండియా డీజీఎం కార్తిసుబ్రమణియన్ తదితరులతో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు అవగాహన పత్రాలు మార్చుకున్నారు. తొలిసారి విజ్ఞాన్‌లోనే ఈ ప్రొగ్రామ్ ప్రవేశ పెడుతున్నట్లు కేంబ్రిడ్జి ప్రతినిధులు వెల్లడించారు. విజ్ఞాన్ వర్సిటీలో కేంబ్రిడ్జి సెంటర్, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీని ఏర్పాటు చేసి ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులతో అనుసంధానం కానున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.86 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96, 104,115
చికెన్ విత్ స్కిన్	184.00
చికెన్ స్కిన్ లెస్	194.00

78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

● రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె, ఆగస్టు 14: తీరప్రాంతంలోని నియోజకవర్గ ప్రజలకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని, వారందరినీ స్మరించుకోవాల్సిన బాధ్యత నేడు మనందరిపై ఉందన్నారు. ప్రతి ఇంటిపైన జాతీయ పతాకం ఎగరాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్ గర్ తిరంగ నినాదాన్ని ఇచ్చారని, అందరూ ఆచరించాలని సూచించారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని ప్రతిఒక్కరిలోనూ నింపుకుని వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్ సాధనకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రూ.25లకే జాతీయ పతాకం

గుంటూరు సిటీ, ఆగస్టు 14 : హర్ ఘర్ తిరంగా 3.0 కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పోస్టాఫీసుల్లో రూ.70 విలువ చేసే జాతీయపతాకం రూ.25కే విక్రయిస్తున్నట్లు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఉసర్తి యలమందయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు పోస్టల్ డివిజన్ పరిధిలోని రెండు హెడ్ పోస్టాఫీసులు, 53 సబ్ పోస్టాఫీసులతో పాటు 125 బ్రాంచి ఆఫీసుల్లో జాతీయ పతాకాలు అందుబాటులో ఉంచామన్నారు. గుంటూరు డివిజన్ పరిధిలో ఇప్పటికే 11,400 జాతీయ పతాకాలు తమకు అందాయని, వీటిని ప్రజలకు అందచేయటానికి సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటున్నారని ఆయన తెలిపారు.


కలుషిత నీటికి కారణమైన బోరింగ్‌ను సీజ్ చేయిస్తున్న పల్నాడు డీఎంహెచ్‌వో

దడపుట్టిస్తున్న డయేరియా

● వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు
● కలుషిత నీరే కారణ మంటున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

క్రోసూరు, ఆగస్టు 14 : క్రోసూరు మండలం హసానాబాద్‌లో డయేరియా దడపుట్టిస్తోంది. ఇప్పటికే సుమారు 50 మంది బాధితులు సత్తెనపల్లి, గుంటూరు, పిడుగురాళ్ళ, క్రోసూరు, రెడ్డిగూడెంలలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ వ్యాధి ప్రబలటానికి కలుషిత నీరే కారణమని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ధ్రువీకరించారు. హసానాబాద్‌లో దొడ్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బుధవారం శిబిరాన్ని డీఎంహెచ్‌వో బీ.రవికుమార్ సందర్శించారు. అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. వ్యాధి ప్రబలటానికి గ్రామంలోని బోరింగ్ నుంచి వచ్చే కలుషత నీరే కారణమని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సిరి చందన, డాక్టర్ మహమ్మద్ సాద్ తెలిపారు. పూర్తిగా జీరో కేసులు నమోదయ్యేవరకు వైద్య శిబిరాన్ని కొనసాగించాలని డీఎంహెచ్‌వో సూచించారు. అనంతరం ఆయన గ్రామంలో పర్యటించి గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి నాణ్యమైన నీటిని అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఆయన సత్తెనపల్లి వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వైద్య శిబిరంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మహమ్మద్ షాద్, డాక్టర్ సిరి చందనతో పాటు కమ్యూనిటీహెల్త్ అధికారి దివ్య, ఏఎన్ఎం ప్రసన్న వైద్యసేవలందిస్తున్నారు.

డయేరియాతో ఇద్దరు మృతి

కారంపూడి, ఆగస్టు 14: మండలంలోని ఒప్పిచర్లకు చెందిన చేపూరి కమలమ్మ (91), వంకాయలపాటి సత్యం (75) డయేరియాతో బాధపడుతూ బుధవారం మృతిచెందినట్లు డాక్టర్ రమ్య తెలిపారు. కమలమ్మ పిడుగురాళ్లలో, సత్యం నరసరావుపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు తెలిపారు. బుధవారం గ్రామంలో మరో రెండు డయేరియా కేసులు నమోదయ్యాయన్నారు. బత్తుల రాజేశ్వరి, కోటమ్మలు డయేరియాతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారన్నారు. గ్రామంలోని పొట్టి శ్రీరాములు కాలనీలో ఇంటింటికి తిరిగి వ్యాధిగ్రస్థులపై విచారణ చేపట్టామన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ ప్రసాద్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్ గ్రామాన్ని సందర్శించి పారిశుధ్యంపై సిబ్బందికి సూచనలు చేశారు.

భోజనంలో పురుగులు వస్తున్నాయి

● ఏఎన్‌యూలో విద్యార్థినుల ఆందోళన
● రిజిస్ట్రార్‌కి వినతి పత్రం అందజేసిన ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

పెదకాకాని, ఆగస్టు 14: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని విద్యార్థినుల హాస్టల్ మెస్ భోజనంలో పురుగులు రావటం దారుణమని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు అన్నారు. బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలంకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ యూనివర్సిటీ మహిళా హాస్టల్ మెస్‌లో విద్యార్థినులకు వడ్డిస్తున్న భోజనంలో పురుగులు వస్తున్నాయని, ఈ విషయంపై నెల రోజుల నుంచి పలుమార్లు చీఫ్ వార్డెన్‌కి చెప్పినా కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. భోజనంలో పులుగు రావటం, భోజనం సరిగా లేకపోవడం పదేపదే జరుగుతుందన్నారు. హాస్టల్లో మెస్ కమిటీ లేకపోవడంతో మెస్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించి, నాణ్యమైన, రుచి కరమైన భోజనాన్ని విద్యార్థినులకు అందించాలని రిజిస్ట్రార్‌ని కోరారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఎస్‌ఎఫ్‌ఐ సెక్రెటరీ కే.నవిత, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాజు, మరియమ్మ, రిచా, మౌనిక, జిల్లా జాయింట్ సెక్రెటరీ పవన్, జిల్లా ఉపాధ్యక్షుడు యశ్వంత్ పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

● గుంటూరు మీదగా నరసపూర్, సికింద్రాబాద్, కాకినాడ టౌన్‌కు..

గుంటూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీదృష్ట్యా గుంటూరు మీదగా నరసపూర్, సికింద్రాబాద్, కాకినాడ టౌన్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు 07169 నరసపూర్ - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 18వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు బయలుదేరి రాత్రి 10.50కి గుంటూరు, 11.33కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.03కి పిడుగురాళ్ల, 12.25కి నడికుడి మరుసటి రోజు ఉదయం 5గంటలకు సికింద్రాబాద్ చేరుకొంటుంది. నెంబరు. 07170 సికింద్రాబాద్ - నరసపూర్ రైలు ఈనెల 19న సోమవారం సాయంత్రం 6.20కి బయలుదేరి రాత్రి 8.49కి నడికుడి, 9.10కి పిడుగురాళ్ల, 9.39కి సత్తెనపల్లి, 10.50కి గుంటూరు, మరుసటి రోజు ఉదయం 5 గంటలకు నరసపూర్ చేరుకొంటుంది. నెంబరు. 07187 కాకినాడ టౌన్ - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈనెల 17,19 తేదీల్లో రాత్రి 9గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపిల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 9.05కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. నెంబరు. 07188 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈనెల 18, 20 తేదీల్లో సాయంత్రం 6.20కి బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 6.30కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుందని సీపీఆర్‌వో తెలిపారు.

47,894 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 49,968 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 47,894 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒర ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 25,370 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	16000	334	9000	16000
నెంబరు. 5	9000	12000	నెంబరు. 5	11500	13000
273	11500	12500	273	–	–
341	8000	16000	341	9000	16000
4884	--	--	4884	10000	14000
సూపర్ 10	10000	10000	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18800	తేజ	7500	18500
బ్యాడిగి	8000	15500	బ్యాడిగి	9000	15500
దేవనూరు డీలక్స్	8500	11500	దేవనూరు డీలక్స్	9500	12000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000


78వ
స్వాతంత్ర్య దినోత్సవ
శుభాకాంక్షలు
SRI BHRAMARA
Building Future
ఇల్లంటే తల్లిలాంటిదని
మా విశ్వాసం
మీ
గల్లా రామచంద్రరావు
ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
శ్రీ భ్రమర టౌన్‌షిప్స్
ప్రైవేట్ లిమిటెడ్
గుంటూరు । కృష్ణ । యన్.టి.ఆర్ । బాపట్ల । పల్నాడు । ప్రకాశం
రిజిష్టర్డ్ ఆఫీస్: మొదటి అంతస్తు, ఎ.పి.ఎస్.ఎఫ్.సి. భవన్, ఇండస్ట్రియల్ పార్క్, గోరంట్ల, ఎమ్.జి. ఇన్నర్‌రింగ్ రోడ్, గుంటూరు, ఎ.పి. 522034.
కార్పొరేట్ ఆఫీస్: విష్ణు నిలయం, డోర్ నెం.59ఎ-15-33, పంటకాల్వ రోడ్, ఎన్.టి.ఆర్. సర్కిల్, పటమట, విజయవాడ, ఎ.పి. 520010.
Follow us: #sribhramaraofficial
www.sribhramara.com

మానవాళి మనుగడకు మొక్కే ఆధారం

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి



విశదల రోడ్డులో మొక్కలు నాటుతున్న కలెక్టర్ తదితరులు

మేడికొండూరు, ఆగస్టు 14: మానవాళి మనుగడకు మొక్కే ఆధారమని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా 'ప్లాంట్ ఫర్ మదర్' కార్యక్రమంలో భాగంగా బుధవారం మేడికొండూరు మండలం విశదల రోడ్డులో కలెక్టర్ నాగలక్ష్మి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న మొక్కలు నాటే కార్యక్రమంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించి వాటి ఎదుగుదలకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవిని ఆమె ఆదేశించారు. రోడ్డు పక్కన నాటే మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేసి సంరక్షించాలని జిల్లా అధికారులకు సూచించారు. డ్వామా ద్వారా 190ఎకరాల్లో వివిధ రకాల పండ్ల మొక్కలు, 13 కిలోమీటర్ల మేర కాలువ అంచున మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. అంతేకాకుండా పది ఎకరాల విస్తీర్ణంలో బ్లాక్ ప్లాంటేషన్‌తో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లోను, విద్యాలయాల్లోను విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే పరిపాలన అనుమతులను నీటి యాజామాన్య సంస్థకు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం ఉపాధి హామీ పథకం కూలీలతో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విశదల మాజీ సర్పంచ్ మామిడి సీతారామయ్య, తహసీల్దార్ బి.పద్మనాభుడు, ఎంపీడీవో ప్రభాకర్‌రావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎంకే కిరణ్మయి, మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు..

డ్రిప్ పని తనాన్ని పరిశీలించిన హార్టికల్చర్ డైరెక్టర్



డ్రాగెన్ ఫ్రూట్ మొక్కలను పరిశీలిస్తున్న డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ కే శ్రీనివాసులు

ఫిరంగిపురం, ఆగస్టు 14 : మండలంలోని పొనుగుపాడు గ్రామంలో డ్రాగెన్ ఫ్రూట్ పొలంలో బిందు, తుంపర్ల సేద్య పరికరాల పని తనాన్ని డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ శ్రీనివాసులు రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. చేవూరి నాగిరెడ్డి, తాళ్ళూరి జక్రయ్యల పొలాలకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు ఇచ్చారని, వీటిని రైతులు సంతృప్తికరంగా వినియోగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఓఎస్డీ వెంకటేశ్వర్లు, పథక సంచాలకులు శ్రీమతి వజ్రశ్రీ, పల్నాడు పథక సంచాలకులు చరణ్ మయో గౌతమ్, ప్రాజెక్టు అధికారి సీబీ హరినాథరెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో అధికారులు ఎంతో కీలకం

కాకుమాను, ఆగస్టు 14: గ్రామాల అభివృద్ధిలో అధికారుల ఎంతో కీలకం గా వ్యవహరించాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. కాకుమాను మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యచరణ గ్రామ స్థాయి సర్పంచులు, అధికారులతో శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీవో రామకృష్ణ, ఈవోపీఆర్డీ నెహ్రూ సమావేశానికి హాజరైన అధికారులు, సర్పంచులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. వీధి దీపాల నిర్వహణ, సీసీ చార్జీలు, ఎల్ఈడీ ప్రాజెక్టుల వలన కలిగి ఉపయోగాలు, గ్రామాల్లో ఉన్న సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో అధికార దుర్వినియోగం : కొల్లా

కాకుమాను, ఆగస్టు 14: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, మంత్రులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి ఆరోపించారు. బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ సీఐడీ జప్తులో ఉన్న అగ్రిగోల్డ్ భూమిని మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ అమ్మడం వారి విధానాలకు నిదర్శనమన్నారు. విదేశాల్లో ఉన్న తన కుమారుడు రాజీవ్‌పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని జోగి రమేష్ అనడం సిగ్గుచేటన్నారు.

రోడ్డు తవ్వి కంకరు తీసుకెళ్లే లారీ స్వాధీనం

తుళ్లూరు, ఆగస్టు 14: వీఐటీ యూనివర్శిటీ సమీపంలో రోడ్డు తవ్వి కంకరు తీసుకెళ్లే ప్రయత్నం చేయటంతో ఈ నెల 8న మండదం వెలగపూడి రైతులు అర్ధరాత్రి లారీలను జేసీబీ వాహనాన్ని అడ్డుకున్నారు. వాటిని పోలీసులకు అప్పజెప్పారు. అయితే వాటికి సంభందించి ఎటువంటి కేసు నమోదు చేయలేదు. పట్టుకొని అప్పజెపితే ఎటువంటి చర్యలు తీసుకోలేదని, అంతేకాకుండా కేసు లేకుండా ఒప్పందం చేసుకున్నారని రైతులు ఆరోపించారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమవటంతో బుధవారం తుళ్లూరు పోలీసులు ఒక టిప్పరు లారీని పట్టుకొని కేసు నమోదు చేశారు.

ఓవర్ లోడు ఇసుక లారి స్వాధీనం..

లింగాయపాలెం తాళ్లాయపాలెం ఇసుక స్టాక్ యార్డు నుంచి లారీలకు, ట్రాక్టర్లకు ఇసుకను లోడు చేస్తున్నారు. టన్ను లోడింగ్‌కు రూ.250 రుసుం తీసుకొని అధికారులు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నారు. అయితే అదనపు లోడు ఉన్న ఇసుక లారీ మందడం పెట్రోలు బంకులో గమనించి తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు స్వాధీనం చేసుకున్నారు. ఆర్డీవోకు కేసును బదిలీ చేశారు. లారీ మంగళగిరి మండలం ఎర్రబాలెంకు చెందినదని చెప్పారు.

పెనుమాకలో పశువైద్య శిబిరం

తాడేపల్లి, ఆగస్టు 14: ఆంధ్రప్రదేశ్ పశుసంవర్థక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో 27 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 15 పశువులకు సాధారణ చికిత్సలు చేశారు. 24 దూడల కు నట్టల నివారణ మందులు, 35 మంది రైతులకు మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. ఇలాంటి పశు వైద్యశిబిరాలు తరచుగా ఏర్పాటు చేయాలని పశు పోషకులు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి కోరారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్లు జగన్ తీరు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

గుంటూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌కు అవమానం జరిగిందని జగన్‌రెడ్డి కేంద్ర ఎస్సీ కమిషన్‌కు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పిస్తూ వారిని ప్రోత్సహించాలని చెప్పిన అంబేద్కర్ మాటలను గత ఐదేళ్లలో వైసీపీ నేతలు ఒక్క రోజుకూడా పాటించలేదన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల జగన్‌కు భారత రాజ్యాంగం గుర్తుకురాలేదన్నారు. ఇప్పుడు ఆయన పేరు అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయాలని చూడడం సిగ్గుచేటన్నారు. ఎస్సీలకు 27 సంక్షేమ పథకాలు రద్దు చేసి, అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి జగనన్న విదేశీ విద్యా పథకం అని తన పేరు పెట్టుకున్న జగన్‌కు ఆయన పేరు ఎత్తే అర్హత లేదన్నారు. అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధానిలో 125 అడుగుల అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటు చేయాలని చంద్రబాబు నిర్ణయించారు. దాని కోసం 30 ఎకరాలు కేటాయించి పనులు మొదలుపెట్టారు. దాన్ని అర్థాంతరంగా ఆపేసిన చరిత్ర జగన్‌దన్నారు. జగన్‌రెడ్డి పేరును తొలగిస్తే అంబేద్కర్ పేరు తొలగించారంటూ వైసీపీ నేతలు దుష్ప్రచారం చేయడం దుర్మార్గమ న్నారు. ప్రజలకు 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గుంటూరు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడు కల్లో విద్యాశాఖా మంత్రి లోకేశ్ పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. దాసరి రాజామాష్టారు మాట్లాడుతూ బయట పడుతున్న వైసీపీ అక్రమాలపై చర్చను పక్కదారి పట్టించడానికి అంబేద్కర్ పేరుతో జగన్ కుటిల యత్నాలు చేస్తున్నాడని ఆరోపించారు. సమావేశంలో కంచర్ల శివరామయ్య, దామచర్ల శ్రీనివాసరావు, బొబ్బిలి రామారావు, మద్దిరాల గంగాధర్, దేవతోటి సుందరయ్య, రావిపాటి సాయికృష్ణ, వేముల కొండ శ్రీనివాస్, మేళం సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగురవేసి ఔన్నత్యాన్ని చాటుదాం

● ప్రత్తిపాడులో 130 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో 130 అడుగుల భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు, ఆగస్టు 14: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నడింపాలెం గ్రామంలో 130 అడుగుల పొడవు గల జాతీయ జెండాతో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ప్రతి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు చేయాలంటూ ఆదేశాలు ఇవ్వడంతో పాటు అందుకు నిధులను కూడా కేటాయించింది. ఈ క్రమంలో నడింపాలెంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచ, డిబెట్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాఠశాలల విద్యార్థులతో 130 అడుగుల భారీ జాతీయ జండాను పట్టుకుని నిర్వహించిన ర్యాలీ అందరినీ ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో హర్ ఘర్ తిరంగా

పెదనందిపాడు, ఆగస్టు 14 : 78వ స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు భారీ జాతీయ పతాకంతో ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశ ఔన్నత్యాన్ని చాటుదాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి వీరరాఘవయ్య, వ్యాయామ అధ్యాపకులు పాతూరి శ్రీనివాసరావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల్లో గురువారం నిర్వహించే 78వ స్వాతంత్ర్య దినోత్సవానికి బుధవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలిసారిగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్లాస్టిక్ రహిత కార్యక్రమంగా నిర్వహించేందుకు సన్నాహకాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా నిర్వహకులు కాగితాలు, పూలతో, వస్త్రాలతో అలంకరణలు చేపట్టారు. పీఏఎస్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు ప్రత్యేకంగా మార్చ్ నిర్వహించనున్నారు.

దుగ్గిరాల మండలంలో..



దుగ్గిరాలలో విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ అధికారులు

దుగ్గిరాల, ఆగస్టు 13: దేశప్రధాని మోదీ యిచ్చిన హర్ ఘర్ తిరంగా జెండా పిలుపు మేరకు, రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున స్వాతంత్ర్యదిన వేడుకలు నిర్వహించనున్నారు. ప్రతిఇంటా మువ్వన్నెల జాతీయపతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుదాం అంటూ ర్యాలీలు బుధవారం నిర్వహించారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల, నిమ్మగడ్డ ఫౌండేషన్ బాలురోన్నత పాఠశాల విద్యార్థులు జాతీయజెండాను చేతపట్టి వివిధ శాఖల అధికారులతో కలిసి గ్రామవీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పంచాయతీరాజ్ అధికారి కుసుమ శ్రీదేవి, ఎంపీడీవో బీ భార్గవి, ఎంఈవోలు కాజ లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, ఎంపీడీవో (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు స్వీకరించిన పి.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ర్యాలీలో పాల్గొన్నారు.

చలపతి ఇంజనీరింగ్ కాలేజీలో న్యాయ విజ్ఞాన సదస్సు



డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జీ లీలావతి

తాడికొండ, గుంటూరు (లీగల్), ఆగస్టు 14: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మోతడకలోని చలపతి ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో న్యాయ విజాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువతపై డ్రగ్స్ ప్రభావం పెరిగిందని అన్నారు. మాదక ద్రవ్యాలు వాడటం చాల ప్రమాదకరమని పేర్కొంటూ, విద్యార్థులకు వాటి గురించి అవగాహన లేకపోవడం వల్ల, వారికి తెలియకుండానే డ్రగ్స్‌కి బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తుపై దృష్టి పెట్టాల ని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ కేసులో పట్టుబడితే శిక్షలు కఠినంగా ఉంటాయని విద్యార్థులను హెచ్చరించారు. ఈ న్యాయవిజ్ఞాన సదస్సులో మాజీ ఏపీపీ, ప్యానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు మాట్లాడుతూ ర్యాగింగ్ నివా రణకు తీసుకోవాల్సిన చర్యలను విద్యార్థులకు వివరించారు. ర్యాగింగ్ కేసుల్లో పట్టుబడిన విద్యార్థులకు జైలు, జరిమానా విధింపబడుతుందని విద్యార్థులను హెచ్చరించారు. ఈ సదస్సులో కలాశాల ప్రిన్సిపాల్ నాగ శ్రీని వాసరావు, డీన్ సుబ్బారావుతో పాటు కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు, పాల్గొన్న కోచ్‌లు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 12: షూటింగ్ బాల్ అసోసియేషన్ అఫ్ గుంటూరు డిస్ట్రిక్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలం, మందపాడు గ్రామంలోని శ్రీ శ్రీనివాస్ హైస్కూల్ మైదానంలో సీనియర్ మహిళలు, పురుషుల విభాగాల్లో షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు జరిగాయి. ఎంపికైన జట్లు త్వరలోనే అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల చైర్మన్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపికల కోఆర్డినేటర్ కరీముల్లా, పాఠశాల ఇన్‌చార్జి శిరీష, అసోసియేషన్ చైర్మన్, కార్యదర్శులు ఎం రవిబాబు, ఎం కిషోర్‌బాబు, పాఠశాల పీడీలు శ్రీనివాసరావు, నరేష్, రాణీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు- పురుషులు: భాను, సాయి, సమీర్, నానీ, తేజ, నాగరాజు, ప్రసాదు, రవితేజ, రామ్‌ప్రకాష్, శ్రీనివాస్, నవీన్, చైతన్య

మహిళలు: తనుశ్రీ, రమ్య, అక్షయ, చరిత, హేమశ్రీ, లక్ష్మీ, అక్స ప్రవల్లిక, సుప్రియ, సుభాషిణీ, రేష్మ

యువత దేశభక్తి భావాలను పెంపొందించుకోవాలి

● బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య

మేడికొండూరు, ఆగష్టు 14: యువత దేశభక్తి భావాలను పెంపొందించుకొని నవ సమాజం కోసం అడుగులు వేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య సూచించారు. హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా పలువురు బీజేపీ నాయకులు పాలడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో మహోన్నతుల విగ్రహాలను శుభ్రపరచి పూలదండలతో అలంకరణ చేశారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆమతి వెంకటరమణ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ బాషా, తుపా కుల షేక్ ఉమర్, శాఖమూరి కృష్ణారావు, నాదెండ్ల శ్రీనివాస రావు, ఉన్నం సాయి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 14: నియోజకవర్గంలో ప్రారం భించిన సీసీ రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక 40వ డివిజన్ పరిధిలోని జన్మభూమినగర్, స్వర్ణాంధ్రానగర్‌లోని సీసీ రోడ్లు, డ్రైనేజీలకు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు కాలనీలకు కలిపి రూ 92లక్షలు మంజూరు అయ్యాయని, నిధులతో సీ సీ రోడ్లు, డ్రైనేజీలను పూర్తి చేయాలన్నారు. పనులను నిత్యం పర్యవేక్షిస్తానని నాణ్యత లోపాలు గమనిస్తే సదరు కాంట్రాక్టరుపై చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. నేడు జరిగే స్వాంతంత్ర్య వేడుకల్లో నియోజకవర్గ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు తాతిరెడ్డి లక్ష్మారెడ్డి, కల్లూరి శ్రీనివాసరావు, సయ్యద్ అహమద్, పి శ్రీనివాసరావు, ఎన్ కోటేశ్వరరావు, కే సాంబశివరావు, తుమ్మేటి మురళి, మోహన్, బ్రహ్మం, మల్లిఖార్జునరావు, గిరి, సునీల్, జోజప్ప తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రజలకు చేరువగా ఉండాలి

● ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారోత్సంలో ఎమ్మెల్యే



ఎమ్మెల్యేతో గ్రామ చెరువు ట్రస్ట్ బోర్డు నూతన కమిటీ సభ్యులు

వట్టిచెరుకూరు, ఆగస్టు 14: పదవులు, అధికారాలు శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తించి బాధ్యతగా ప్రతి ఒక్కరితో సత్సంబంధాలు కలిగి స్వచ్ఛమైన తాగునీరు అందించేలా నూతన కమిటీ పనిచేయాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సూచించారు. మండలం పరిధి చమళ్ళమూడి గ్రామంలో దేవదాయ, ధర్మదాయ శాఖ అధీనంలోని గ్రామ చెరువు ట్రస్ట్ బోర్డు నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం నిర్వహించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పర్యవేక్షణలో నూతన ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ఆరెకపూడి బాల మురళీకృష్ణతో పాటు మరో ఆరుగురిని సభ్యులుగా నియామిస్తూ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, స్థానిక గ్రామ నాయకులు, జనసేన నాయకులు, గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిది

● పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు

వట్టిచెరుకూరు, ఆగస్టు 14: పర్యావరణం సమతుల్యంగా ఉంటేనే ప్రతి జీవి మనుగడ సాగించగలుగుతుందని, సమతుల్యత లోపిస్తే అనేక విపత్కర పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. మండలపరిధి పుల్లడిగుంట సమీపంలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో బుధవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై జరిగిన అవగాహన సదస్సులో అద్దంకి శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు పర్యవేక్షించి గెలపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్ ప్రసాద్, జయలక్ష్మి, వి.వెంకటేశ్వరరావు, షేక్ బాజీద్‌ఖాన్, రామాంజనేయులు, నేరేళ్ల తిరుపతిరావు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావులు పాలొన్నారు.

25న తెలుగు స్టేట్స్ ఓపెన్ చెస్ టోర్నమెంట్



ఓపెన్ చెస్ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైవీ ఆంజనేయులు

తాడికొండ, ఆగస్టు 14: తెలుగు స్టేట్స్ ఓపెన్ చెస్ టోర్న మెంట్‌ను ఈనెల 25న మోతడక చలపతి ఫార్మసీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు పేర్కొన్నారు. మోతడక చలపతి ఫార్మసీ కళాశాలలో ఓపెన్ చెస్ టోర్నమెంట్ గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ చలపతి ఫార్మసీ కళాశాలలు, ఆనంద్ చెస్ వింగ్స్ సహకారంతో సంయుక్తంగా కలిసి ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ.77,777లు నగదు బహుమతులను అందజేస్తున్నట్లు తెలియజేశారు. టోర్నమెంట్‌లో పాల్గొనే వారు రూ.700లు రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9703049378 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామరావు, ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ ఎం.గోపినాథ్, ఫిజికల్ డైరెక్టర్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి

ఫిరంగిపురం, ఆగస్టు 14: గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఈవోపీఆర్డీ ఎంఎస్ లక్ష్మీకుమారి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులుగా పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణ ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు.

182 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, ఆగస్టు 14: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 182 బస్తాల పసు పును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,100, గరిష్ఠధర రూ.12,600, మోడల్‌ధర రూ.12,300 పలికాయి. కాయ క్వింటాల్ కనిష్ఠ ధర రూ. 10,200, గరిష్ఠధర రూ.13,000, మోడల్‌ధర రూ. 12,300లు పలికాయి.

వైసీపీ కక్ష కట్టినా.. లోకేశ్ ఆకలి తీర్చారు

మంగళగిరి, ఆగస్టు 14: వైసీపీ ప్రభుత్వం కక్షకట్టి రాష్ట్ర వ్యాపితంగా ఉన్న అన్న క్యాంటీన్లను మూసివేయించినా మంగళగిరిలో మాత్రం తమ నాయకుడు నారా లోకేశ్ చాల పట్టుదలగా మూడు అన్న క్యాంటీన్లను విజయవంతంగా నిర్వహింపజేస్తూ వచ్చారని టీడీపీ పట్టణ శాఖ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నిర్వహిస్తున్న అన్నక్యాంటీన్‌లో వరుసగా 798వ రోజు కూడ పేదలకు అన్నదానం నిర్వహించారు. ప్రతిపక్షంలో ఉండి కూడా నియోజకవర్గంలోని మూడు కేంద్రాల్లో అన్న క్యాంటీన్లను నిర్వహిస్తూ వచ్చామన్నారు. అన్న క్యాంటీన్ల మూసివేతతో రాష్ట్ర వ్యాపితంగా ఎందరో పేదలు ఆవేదనకు గురికావడంతో పార్టీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని ప్రజలకు ఇచ్చిన హమీ మేరకు రెండు మాసాల వ్యవధిలోనే వంద క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభిస్తున్నారని చెప్పారు. ఈ పర్యాయం గ్రామీణ ప్రాంతాలకు కూడ అన్నక్యాంటీన్ సేవలను విస్తరింపజేయడం తెలుగుదేశం ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కక్ష కట్టడం, వేధించడం, కూల్చివేయడమే లక్ష్యాలుగా పాలనను కొనసాగించిందన్నారు. కానీ తెలుగుదేశం ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే లక్ష్యాలుగా పాలన సాగిస్తుందని గోవాడ చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ పట్టణ అధ్యక్షుడు వాకా మాధవరావు, సింహాద్రి రామారావు, తాడిబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో బుధవారం అన్నదానం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పశ్చిమ డెల్టా కాల్వకు 7026 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 14: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 7026 క్యూసెక్కుల సాగునీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హైలెవెల్ చానల్‌కు 334 క్యూసెక్కుల నీరు, రేపల్లె కాల్వకు 1748 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 755 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 240 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 460 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2840 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మంగళగిరి డీఎస్పీగా మురళీకృష్ణ

మంగళగిరి సిటీ, ఆగస్టు 14: మంగళగిరి డీఎస్పీగా సీహెచ్ మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా బుధవారం ఉత్తర్వులను వెలువరించింది. మురళీకృష్ణ గతంలో బాపట్ల డీఎస్పీగా పనిచేశారు. తాజాగా ఆయన స్థానంలో గోగినేని రామాంజనేయులను బాపట్ల డీఎస్పీగా నియమించింది. మురళీకృష్ణ ఒకటి రెండు రోజుల్లో బాధ్యతలను స్వీకరించనున్నారు.

కలకత్తా ఘటనకు నిరసనగా వైద్యుల ర్యాలీ



కలకత్తా ఘటనకు నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్న ఇందిరానగర్ యుపీహెచ్‌సీ సిబ్బంది



మంగళగిరి సిటీ, ఆగస్టు 14: కలకత్తాలో వైద్యవిద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటన, హత్యను ఖండిస్తూ స్థానిక గణపతినగర్‌లోని ఇందిరానగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ సిబ్బంది బుధవారం సాయంత్రం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత హెల్త్ సెంటర్ వద్ద వెలిగించిన కొవ్వొత్తులతో పెద్దఎత్తున నినాదాలను చేశారు. ర్యాలీని ఉద్దేశించి యుపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.అనూష మాట్లాడుతూ ఆస్పత్రిలో రాత్రి విధులు నిర్వరిస్తున్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేయడంతోపాటు శరీరభాగాలను తీవ్రంగా గాయపరిచిన తీరు చాల బాధ కలిగించిందన్నారు. ఢిల్లీలో నిర్భయ కేసు తరువాత ఇది నిర్భయ-2 మాదిరిగా ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దుశ్చర్యలకు వేరేవ్వరూ పాల్పడకుండా ఉండేందుకు నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి తగిన న్యాయం జరిగేంతవరకు డాక్టర్స్ అసోసియేషన్‌లు ఈ ఆందోళనకు మద్దతుగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నూతక్కి, రామచంద్రాపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ చండీప్రియాంక, ఎయిమ్స్ సీనియర్ రెసిడెంట్ డాక్టర్ జగదీష్, ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ రష్మిత, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ విజయ్, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ సుభిక్ష, మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఏ శ్రీమన్నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

దుగ్గిరాల, ఆగస్టు 14 : మండలపరిధి పెనుమూలి రోడ్డులో పేకాడుతున్న నలుగురిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. తమ సిబ్బందితో కలిసి నిఘావేసి పేకాడుతుండగా నలుగురిని పట్టుకుని వారి నుంచి రూ.2500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎస్ వెంకటరవి తెలిపారు.

జనసేన కార్యాలయం వద్ద ఆహారశిబిరం



మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఏర్పాటు చేస్తున్న డొక్కా సీతమ్మ ఆహారశిబిరం

మంగళగిరి, ఆగస్టు 14: స్థానిక బైపాస్ రోడ్డు వెంబడి ఉన్న జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద ప్రత్యేక క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాపితంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటుచేస్తున్న నేపథ్యంలో జనసేన కార్యాలయం వద్ద ఆసేవలను ప్రజలకు అందించే లక్ష్యంతో ప్రత్యేక ఆహార శిబిరాన్ని బుధవారం ఏర్పాటుచేశారు. దీనికి డొక్కా సీతమ్మ ఆహార శిబిరంగా నామకరణం చేశారు. ఈ క్యాంటీన్‌ను ఆగస్టు 15వ తేదీన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జనసేన చేనేత విభాగం రాష్ట్ర చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఆహారశిబిరం కోసం ప్రత్యేకంగా తయారుచేయించిన ఐరన్ నిర్మాణాన్ని జనసేన కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసి ముస్తాబు చేశారు.

పెదనందిపాడు తహసీల్దార్‌గా శంకర్‌బాబు



తహసీల్దార్ శంకర్‌బాబు

పెదనందిపాడు, ఆగస్టు 14: పెదనందిపాడు మండల తహసీల్దార్‌గా పి.శంకర్‌బాబు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. వెలగపూడి సచివాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ డి.లాజరస్ సొంత జిల్లా నెల్లూరుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శంకర్‌బాబు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, ప్రజల నుంచి వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపుతామని తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఆయనను సత్కరించారు.

నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్



బ్యాగును మహిళకు అందజేస్తున్న ఆటోడ్రైవర్

మంగళగిరిసిటీ, ఆగస్టు 14: ఆటోలో ప్రయాణిస్తూ ఏమరుపాటుగా బ్యాగును మర్చిపోయి వెళ్లిన ఓ మహిళకు సదరు ఆటోడ్రైవర్ తిరిగి అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వినోద్‌కుమార్ ఆటోడ్రైవర్ సురేష్‌ను అభినందించాడు. గుంటూరు నుంచి ఓ మహిళ ఆటోలో మంగళగిరి వచ్చారు. అయితే ఆమె ఆటో దిగే సమయంలో హడావిడిగా వెళ్లిపోతూ తన బ్యాగును మర్చిపోయి వెళ్లింది. కొద్ది సేపటికి ఆ బ్యాగును గుర్తించిన ఆటో డ్రైవర్ సురేష్ సదరు బ్యాగును పట్టణ పోలీసుస్టేషన్‌లో అప్పగించాడు. కొద్దిసేపటికి ఆ మహిళ కూడ పట్టణ పోలీసుస్టేషన్‌ను చేరుకుని తన బ్యాగు పోయిందంటూ సీఐ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న సీఐ వినోద్ ఆటోడ్రైవర్ సురేష్‌ను పిలిపించి అతని చేతుల మీదుగానే బ్యాగును ఆ మహిళకు అందజేయించారు. సదరు బ్యాగులో ల్యాప్‌టాప్‌తోపాటు మరికొన్ని వస్తువులు యధావిధిగా ఉండడంతో సదరు మహిళ ఆటోడ్రైవర్ సురేష్‌కు, సీఐకి కృతజ్ఞతలు తెలిపింది.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు, ప్యాడ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, ఆగస్టు 14: విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో గుంటూరు జిల్లా పద్మశాలీ సాధికార సమితి సభ్యులు జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం విద్యాసామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక షైన్ అనాధ శరణాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి ముఖ్యఅతిధిగా పాల్గొని విద్యార్థులకు స్కూలు బ్యాగులు, పెన్నులు, పరీక్ష ప్యాడ్లు తదితర సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు అవసరమైన విద్యా ఉపకరణాలను జొన్నాదుల అందజేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ శాఖ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, నాయకులు అన్నం నాగబాబు, వాకా మాధవరావు, గోసాల రాఘవ, లక్ష్మీనరసింహ గోల్డ్‌స్మిత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుంటి నాగరాజు, గాజుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా యడ్ల లింగయ్య కాలనీలో పారిశుధ్యం

- కాలనీలో గృహాల నడుమ పిచ్చిమొక్కలు, రోడ్లవెంట వ్యర్థాలు
- రోజుల తరబడి నిలిచిన మురుగునీరు
- రూ.కోట్లతో నిర్మించినా సద్వినియోగం కాని హెల్త్‌సెంటర్
- అధికారులు దృష్టిపెట్టాలని కాలనీవాసుల విజ్ఞప్తి

తెనాలి రూరల్, ఆగస్టు 14: రోడ్డు వెంబడి వ్యర్థాలు, ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు రోజులు తరబడి నిలిచిన దుర్గంధం వెదజల్లుతున్న మురుగునీరు.. రాత్రి సమయాల్లో ఆ కాలనీకి వెళ్లాలంటే వణుకు పుట్టించే సర్పాలతో ఉన్న ప్రాంతం తెనాలి ఎడ్లలింగయ్య కాలనీ. తెనాలి నుంచి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కాలనీలో అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. కాలనీకి ఇరువైపులా ఉన్న రోడ్లపై పిచ్చిమొక్కలు విపరీతంగా పెరగడంతో ఆయా ప్రాంతాల్లో ఉన్న ఖాళీ ప్రదేశాలు సైతం చిట్టడివిని తలపిస్తున్నాయి. ఆ రోడ్లకు ఇరువైపులా కాలువలు లేక మురుగునీరు సైతం రోజులు తరబడి నిలిచి దుర్గంధం వెదజల్లుతున్నాయి. పగలు రాత్రి తేడా లేకుండా కాలనీలో పాములు సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. చెత్త సైతం రోడ్డుపైనే పారబోసి సంబంధిత శాఖల అధికారులు సైతం ఈ కాలనీపై చిన్నచూపుచూస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దారిపొడవునా కనీసం వీధిలైట్లు కూడా పనిచేయని దుస్థితిలో తమ కాలనీ ఉందని పలువురు వాపోతున్నారు. కాలనీ శివారులో రూ.కోట్లతో నిర్మించిన అర్బన్‌హెల్త్ సెంటర్ చుట్టూకూడా దుర్గంధభరితంగా ఉంది. కనీసం ఈ హెల్త్ సెంటర్‌కు ప్రజలు వచ్చి వైద్యం చేయించుకునేందుకు సరైన రోడ్డుమార్గం కూడా లేకపోవడంతో ఈ ఆరోగ్యకేంద్రం అలంకారప్రాయంగా మారింది. ఇందులో డాక్టర్, సిబ్బంది, ల్యాబ్‌టెక్నీషియన్స్ వంటివారిని సైతం ఏర్పాటుచేశారు. ఇదే సెంటర్‌లో ప్రసవాలు చేసేందుకు, ఆసుపత్రిలోనే డాక్టర్ల పర్యవేక్షణలో రోగికి చికిత్స అందించేలా ప్రత్యేక గదుల్లో బెడ్లు, వివిధ రకాల రక్తపరీక్షలు, మందులు అందు బాటులో ఉంచారు. అయితే రోగుల తాకిడి స్వల్పంగా ఉండటంతో ఇక్కడ వైద్యసిబ్బంది కూడా అందుబాటులో ఉండరన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఉదయం వచ్చి హాజరు వేసుకుని ఇతర పనులకు వెళుతున్నారని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉండటంతో దోమల బెడద కూడా ఎక్కువగా ఉంటోందని, జ్వరాలబారిన పడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయిస్తున్నట్లు ఆ కాలనీవాసులు వాపోతున్నారు. తమ ప్రాంతంలో పెద్దసంఖ్యలో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవ్వకముందే అధికారులు మేల్కొని కాలనీలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను, రోజులు తరబడి నిలిచిఉన్న మురుగునీరును, రోడ్లవెంబడి ఉన్న వ్యర్థాలను తొలగించడంతో పాటు వీధిలైట్లు, హెల్త్ సెంటర్ సేవలను ప్రజలకు చేరువచేసేలా చర్యలు చేపట్టాలని ఆ ప్రాంతవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



హెల్త్ సెంటర్ సమీపంలో రంగుమారి నిలిచి ఉన్ననీరు, కాలువలు లేక నిలిచిన మురుగు, కాలనీరోడ్డు వెంబడి పేరుకుపోయిన వ్యర్థాలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి లక్ష్మీ కుమారి

జ్వరాలు తగ్గే వరకు వైద్య శిబిరం

చేబ్రోలు, ఆగస్టు 14: జ్వరాలు తగ్గేవరకు వైద్య శిబిరం కొనసాగించాలని మండల ప్రత్యేక అధికారి ఏ లక్ష్మీకుమారి ఆదేశించారు. వడ్లమూడిలో వైద్య శిబిరాన్ని బుధవారం ప్రత్యేక అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా జ్వర పీడితుల గురించి ఆరా తీశారు. గ్రామంలో పారిశుధ్య సమస్యలు మెరుగు పరచటానికి చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించండి

- పట్టణ మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఆగస్టు 14: పట్టణంలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ పారిశుధ్య అధికారులను పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. స్థానిక 37వ వార్డులో జరగుతున్న పారిశుధ్య పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న పరిశీలించి అధికారులకు, కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువలో మురుగు నీటి పారుదల సక్రమంగా జరిగితే దోమల బారిన పడమని, సీజనల్ వ్యాధులు ప్రబలవని అన్నారు. అనంతరం 40వ వార్డులో జరగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బోనస్ అందజేస్తున్న శాంతకుమార్

పాల ఉత్పత్తిదారులకు రూ.1.72 లక్షలు బోనస్ పంపిణీ

తెనాలి అర్బన్, ఆగస్టు 14: రూరల్ మండలం ఎరుకలపూడిలో పాల ఉత్పత్తిదారులకు బుధవారం రూ.1.72 లక్షలు బోనస్ పంపిణీ చేశారు. సంగం డెయిరీ పాల కేంద్రంలో గత రెండేళ్లుగా పాలు ఉత్పత్తి చేస్తున్న 55 మంది రైతులకు ఈ బోనస్‌ను శాంతకుమార్ చేతుల మీదుగా అందజేశారు. పాల ఉత్పత్తిదారులకు సంగం డెయిరీ పశుగ్రాసం, పశువైద్యం, బీమా సౌకర్యాలు అందిస్తుందని కో-ఆర్డినేటర్ సందీప్‌కృష్ణ తెలిపారు. తాళ్ల శ్రావణ్య, నక్కా చిరంజీవి, లక్ష్మీభవానీ తదితరులు పాల్గొన్నారు. రూరల్ మండలం ఎరుకలపూడి, కొలకలూరు, ఖాజీపేట, హాఫ్‌పేట లో కూడా బోనస్ పంపిణీ చేశామని సంగం డెయిరీ కో-ఆర్డినేటర్ తెలిపారు.

కాటూరి శిల్పశాలలో వినూత్న శిల్పం


రాట్నం వడుకుతున్న గాంధీజీ శిల్పంతో శిల్పులు

తెనాలి అర్బన్, ఆగస్టు 14: ఐరన్ నట్టులు, బోల్టులు, వాషర్లు, చైన్‌లు వినియోగించి కాటూరి శిల్పశాల శిల్పులు మరో వినూత్న ఆవిష్కరణ గావించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని మహాత్మాగాంధీ రాట్నం వడుకుతున్న శిల్పాన్ని రూపొందించారు. పట్టణంలోని శిల్పశాల ఎదుట స్వాతంత్ర్య వేడుకలు నేపధ్యంలో ఏర్పాటు చేసిన శిల్పం పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్రలు ఈ శిల్పాన్ని తీర్చిదిద్దారు.

మహనీయుల త్యాగాలను మననం చేసుకోవాలి

● సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్


ఫొటో గ్యాలరీని సందర్శిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్, రైల్వే అధికారులు

తెనాలి రూరల్, ఆగస్టు 14: దేశ స్వాతంత్ర్యం కోసం ఆ నాడు ఎందరో మహనీయులు బ్రిటీష్‌దొరల తూటాలకు బలైపోయారని, వారందరినీ ప్రతి ఒక్కరూ మననం చేసుకోవాలని తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. బుధవారం దేశవిభజన గాయాల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఆనాటి పోరాటాల ఫొటో ఎగ్జిబిషన్‌ను సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వాటిని తిలకించి ఆ మహానుభావుల త్యాగాలను ఇప్పటికీ సజీవంగా మన ముందుంచేలా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటీష్ దొరల బానిసత్వం నుంచి స్వాతంత్ర్యం కోసం కుల, మతాలకు అతీతంగా పోరాటాలు జరిపి ప్రాణాలను సైతం విడిచిపెట్టారు. వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ మననం చేసుకోవాల్సి ఉందన్నారు. అందరం కలిసికట్టుగా ఉంటూ కుల, మత, ప్రాంతీయ బేధాలను మరచి భారతదేశ ముద్దుబిడ్డలుగా జీవిద్దామని ప్రఖర్‌జైన్ కోరారు. పెద్ద సంఖ్యలో రైల్వేప్యాసింజర్లు ఈ ప్రదర్శనలను తిలకించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యునికేషన్ గుంటూరు ఫీల్డ్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో సీబీసీ గుంటూరు ఫీల్డ్ ఆఫీసర్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ఆర్ రమేష్‌చంద్ర, తెనాలి రైల్వేస్టేషన్ టి.వెంకటరమణ, బీజేపీ నాయకుడు పాటిబండ్ల రామకృష్ణ, బి.కనకదుర్గ, టి.శివశంకర్, విజయవాడ సీనియర్ డివిజన్ ఇంజనీర్ (కో ఆర్డినేషన్) వరుణ్‌బాబు, ఇతర సీనియర్ రైల్వే అధికారులు కె.శ్రీనివాసరావు, ఎన్.వెంకటరావు, శౌరిబాబు, టి.వెంకటరమణ, ఎన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

● సివిల్ జడ్జి పవన్‌కుమార్



సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి పవన్‌కుమార్

తెనాలి అర్బన్, ఆగస్టు 14: విద్యార్థులు విలువైన జీవితాన్ని చెడు వ్యసనాలకు బానిసలై చెడగొట్టుకోవద్దని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ చెప్పారు. మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా అనే అంశంపై ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో ఉన్నత స్థానానికి చేరాలని ఆశిస్తారని వారు ఆశించిన కలను నెరవేర్చాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎదుగుదలకు వినియోగించుకోవాలి కాని జీవితాలను నాశనం చేసుకునేందుకు కాదన్నారు. యుక్త వయసులో వచ్చే మార్పులపై అప్రమత్తంగా ఉండాలని, మాదక ద్రవ్యాలు యువత ఆకర్షితులు కావడం బాధాకరమన్నారు. చట్టాన్ని మీరితే శిక్షలకు ఎవరూ అతీతులు కారని చెప్పారు. ఏదైనా ఒక అలవాటు వ్యక్తిత్వాన్ని పెంచేదిగా ఉండాలే కాని దిగజారేలా ఉండకూడదన్నారు. ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, పద్మజ, అనీల్‌కుమార్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.


78 మీటర్ల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఉత్సాహంగా హర్‌ఘర్ తిరంగా యాత్ర

పొన్నూరు టౌన్, ఆగస్టు 14: పట్టణంలో ఉత్సాహంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ జరిగింది. బుధవారం అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పలు కూడళ్ల మీదుగా ఈ యాత్ర నిర్వహించారు. 78 మీటర్ల పొడవైన మువ్వెల జాతీయ జెండాను నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీలో ప్రదర్శించారు. ఏబీవీపీ, విద్యార్థి సంఘాల నాయకులు జైభారత్ నినాదాలతో పట్టణ వీధులు మారుమ్రోగాయి. భారీ జాతీయ పతాక ప్రదర్శన పట్టణ వాసులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివలక్ష్మి, ఏబీవీపీ గుంటూరు విభాగ ప్రముఖ్ రఘునాథబాబు, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్ తాటి నరేష్ కుమార్, ఏబీవీపీ సంఘం నాయకులు, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అవసరం

● టూ టౌన్ సీఐ సుధాకర్

తెనాలి అర్బన్, ఆగస్టు 14: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు ఉండటం వారి కెరీర్‌కు ఎంతో అవసరమని టూ టౌన్ సీఐ సుధాకర్ చెప్పారు. గంగానమ్మపేట నారాయణ స్కూల్‌లో బుధవారం కేబినెట్ ఇన్‌స్టాలేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఆయా తరగతులకు క్లాస్ లీడర్లుగా ఎంపికైన విద్యార్థులకు బ్యాడ్జీలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో మంచి ఉపాధి అందుకోవాలంటే ఆంగ్లం మాట్లాడటం, అర్థం చేసుకోవడం, సబ్జెక్టు నైపుణ్యం, బృంద నిర్వహణ వంటి నైపుణ్యాలు అవసరమన్నారు. సెల్‌ఫోన్‌తో కాలం గడపకుండా విద్యార్థి దశలో కష్టపడిన వారే జీవితంలో సుఖపడతారని చెప్పారు. ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఆర్ఐ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.


స్వాతంత్ర్య సమర యోధుడు శేషిరెడ్డిని సన్మానిస్తున్న విద్యార్థులు

స్వాతంత్ర్య సమరయోధుడు శేషిరెడ్డికి సన్మానం

కొల్లిపర, ఆగస్టు 14: 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని మున్నంగి గ్రామానికి చెందిన 103 సంవత్సరాల వృద్ధుడు ఆళ్ళ శేషిరెడ్డిని గ్రామంలోని పాఠశాల విద్యార్థులు సత్కరించి, ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా శేషిరెడ్డి మాట్లాడుతూ ఆరోజుల్లో బ్రిటీషు పోలీసులు మున్నంగి సెంటర్ దగ్గర నుంచి తన ఇంటి వరకు వరుసగా నిల్చున్నారని ఆ దృశ్యాలు ఇప్పటికీ బాగా గుర్తున్నాయని అన్నారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరం నాటి విశేషాలను ఆయనను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాము, ఉపాధ్యాయురాలు సోమరౌతు లక్ష్మికమల తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఏడీఏ ఉషారాణి

రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

● ఏడీఏ ఉషారాణి

కొల్లిపర, ఆగస్టు 14: రైతులు నూతన పరిజ్ఞానం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఏడీఏ ఉషారాణి అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సేకరణ కేంద్రంలో సుస్థిర వ్యవసాయ శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్ శ్యామ్‌సుందరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ విచక్షణారహితంగా పురుగు మందులు, రసాయనిక ఎరువులు అధికంగా వాడటం వలన రైతులు నష్టపోతున్నారన్నారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతి ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించటానికి అవకాశం ఉందన్నారు. శాస్త్రవేత్త మురళి మాట్లాడుతూ భూసార యాజమాన్యం వలన మొక్కలకు పోషక పదార్థాలందించే సూక్ష్మక్రిములు బాగా పెరిగి భూమిలో జీవపదార్థం అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందన్నారు. రైతులు పంట మార్పిడి చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రేష్ఠ ఎఫ్‌పీసీ చైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి, డైరెక్టర్ ఉయ్యూరు సాంబిరెడ్డి, నీలగిరి ఫౌండేషన్ సభ్యుడు రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


అమరవీరుల స్థూపాల వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

అమర వీరులకు ఎన్‌సీసీ క్యాడెట్ల నివాళి

తెనాలి అర్బన్, ఆగస్టు 14: రణరంగ చౌక్‌లోని అమరవీరుల స్థూపాల వద్ద ఎన్‌సీసీ క్యాడెట్లు నివాళులర్పించారు. జేఎంజే కళాశాల, ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కళాశాల నుంచి రణరంగచౌక్ వరకు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అమరవీరులకు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ షైనీ, అరుణ సుజాత పర్యవేక్షించారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

పొన్నూరు టౌన్, ఆగస్టు 14: గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించటం హర్షణీయం అని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జక్క రవీంద్రనాథ్ అన్నారు. మండల పరిధిలోని కసుకర్రులో బుధవారం అమృత కంటి ఆసుపత్రి పొన్నూరు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని జక్క రవీంద్రనాధ్ ప్రారంభించారు. డాక్టర్ అమృత పాని ఆధ్వర్యంలో 50మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి రాయితీపై కళ్లజోళ్లు అందించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జి.రాజు, ఎస్.రాజు, గోపి పాల్గొన్నారు.